# మనవే'మన పద్యాలు

ఆ. వె. వాన కురియకున్న వచ్చును క్షామంబు
వాన కురిసెనేని వరద పాఱు
వరద కరవు రెండు వరుసగా నెఱుగడీ
విశ్వదాభిరామ వినురవేమ!

**అర్థములు** : క్షామము = కఱవు;
నెఱుగడీ = తెలిసికొనుము;

**తాత్పర్యము** : వానలు సరిగా కురియని పరిస్థితిలో పంటలు సరిగా పండకపోవడమువలన కఱవు కాటకములు కలుగును. వానలు ఎక్కువ కురిసినచో నీరు వరదలై ప్రవహించును. వరద, కఱవు రెండును ఒకదాని వెనుక మరియొక్కటి యుండును. వానలు లేనినాడు, వానలు ఎక్కువైనప్పుడు కూడా కఱవు వచ్చుట సహజము. అటులనే మన జీవిత ప్రయాణములో సహితము కష్టములు, సుఖములు ఒకదాని వెంబడి మరియొకటి వచ్చుచుండును. అలాకాక ఎల్లప్పుడు సుఖములే కలిగినచో, సుఖమునకు విలువేమి ఉంటుంది? ఏదియు మితిమీరకుండ ఉన్నంతవరకు సౌఖ్యము కలుగును. అలాకాని పక్షములో సుఖము లేదు.

ఆ. వె. అన్నమిడుట కన్న నధికదానంబుల
నెన్ని చేయనేమి యెన్నబోరు
అన్నమెన్న జీవనాధార మగునయా
విశ్వదాభిరామ వినురవేమ!

**అర్థములు** : జీవనాధారము = జీవనానికి ఆధారము, బ్రతుకు తెరువు;

**తాత్పర్యము**: 'కోటివిద్యలు కూటికొఱకే' అనేది మనకు తెలిసిన విషయమే! మన ధనము, విలువైన వస్తువులు, పొలము, ఇల్లు ఇలాంటివి ఎన్ని దానము చేసినను యాచకుని తృప్తి పరచలేము. చాలా సందర్భములలో 'ఆయనవద్ద అంత ఉన్నది కదా! మరికొంచెం ఇస్తే ఏమి పోతుంది' అనే అసంతృప్తిమాత్రమే కానవస్తుంది. అదే మనమెవరికైనా కడుపునిండుగా భోజనము పెట్టినచో, కడుపు నిండిన తరువాత 'ఇక చాలు' అని సంతృప్తిని వెల్లడిచేయును. ఆ విధముగా తృప్తి కలిగించు అన్నదానమే అన్ని దానములలోనూ గొప్పది. అన్నము మానవులకే కాక, పశుపక్ష్యాదులకు, సకల జీవకోటికి కూడా జీవనాధారము. కావున అన్నదానము ఉత్కృష్టమైనది.

*(ఇందులో కొంత భాగము స్వామి చిదాత్మానందగారి 'వేమన పద్యములు - అంతరార్థము' ప్రవచనములలో ఒంట పట్టించుకున్న సారాంశము. పూజ్య శ్రీ స్వామి చిదాత్మానంద గారికి ధన్యవాదములతో...)*

**వేమన పద్యములలోని కొన్ని సామెతలు:** 1. కుక్కతోక బట్టి గోదావరీదునా?
2. తలలు బోడులైన తలపులు బోడులా? 3. అప్పులేనివాడె అధిక సంపన్నుడు